

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

షాం – ఎ– గం కీ కసం, ఆజ్ గం గీన్ హై హమ్

ఆభి జా ఆభి జా ఆజ్ మేరే సనం

దిల్ పరేషాన్ హై, రాత్ వీరాన్ హై

దేఖో జా కిస్ తర్హా, ఆజ్ తన్‌హా హై హమ్

'ఫుట్ పాత్ ' (1953) సినిమాలోని ఈ మధురమైన విరహ ప్రేమగీతం, సంగీత దర్శకుడు ఖయ్యామ్ 'సంగీత గీతం'లా నిలుస్తుంది. తలత్ మహమూద్ పాడిన మృదుమధురమైన గీతాలలో అత్యంత సున్నితమైన గీతంలా, నిండు పున్నమి రాత్రి, చెట్ల ఆకుల సందులనుండి దోబూచులాడే వెన్నెల కిరణాల స్పర్శ కోసం ఎదురుచూస్తూ, భూమి విడిచే నిట్టూర్పు అంత మృదువైన వేదనా గీతాలలో అగ్రశ్రేణి గీతంలా నిలుస్తుంది. మజ్రూహ్ సుల్తాన్ పురి రాసిన అత్యంత మృదువైన గీతం ఇది. ఒంటరి తనంతో ఎదురు చూస్తూ, ప్రేయసి కోసం ఎదురు చూస్తూ, ఆమె లేమిని అనుభవిస్తూ బాధలో ఉన్న యువకుల హృదయం లోలోతుల్లోంచి వెలువడే సన్నని నిట్టూర్పును ప్రతిబింబిస్తూ సహానుభూతిని అనుభవిస్తూ, ఎదలోలోతుల్లో కనబడని సున్నితమైన గాయానికి ఉపశమనంలా పనిచేసే లేపనంలాంటి పాట ఇది.

ఈ పాటలోని సందర్భం ఒకప్పుడు, ప్రేమ ఒక సున్నితమైన ఆత్మ సంబంధిత భావన అన్న గ్రహింపు సినిమాలలో నెలకొని ఉన్నప్పుడు సినిమాల్లో చాలా తరచుగా ఎదుర్కొనే సందర్భం. నాయిక కోసం నాయకుడు ఎదురు చూస్తుంటాడు. ఎదురు చూస్తూ, ఆమె లేని లోటును తన హృదయ వేదనను వ్యక్తపరుస్తాడు గేయం రూపంలో.

అది విషాదపూరితమైన సమయం. 'షాం' అంటే సాధారణంగా సాయం సమయాన్ని సూచిస్తుంది. కానీ 'షాం – ఎ –గజల్ ' అంటే గజల్ పాటలతో నిండిన సాయంత్రం అన్న అర్థం స్ఫురించినా అది కేవలం సాయం సమయానికి పరిమితంకాదు. ఆ రాత్రి విషాద భరితమైనదిగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 'గంగీన్' అంటే వేదన. మామూలు వేదన కాదు సంపూర్ణమైన ,తీవ్రమైన వేదన. ఒళ్లంతా, అణువణువూ వేదనతో రగులుతోందన్నమాట. ఇలాంటి ఒక బాధాకరమైన వేదన నిండిన రాత్రి ఇది. అతని హృదయం ఆందోళనా భరితంగా ఉంది. రాత్రి ఒంటరిగా, ఎడారిలాగా ఉంది. అందుకని త్వరగా రమ్మంటున్నాడు. ఆమె లేదు కాబట్టి అది 'షాం – ఎ – గం' అయింది. ఆమెలేదు కాబట్టి అతడు 'గంగీన్' అయ్యాడు. ఆమె లేదు కాబట్టి అతడి హృదయం 'పరేషాన్' తో ఉంది. ఆమెలేదు కాబట్టి రాత్రి 'వీరాన్' అయింది. ఇది తిన్నగా చెప్పకుండా రాత్రి ఇలా ఉంది, హృదయం అలా ఉంది. నువ్వు వచ్చెయ్యి అంటున్నాడు. ఆమె వస్తే ఇవన్నీ సంతోష భరితం, ఆనందమయం అవుతాయి. ఎంతో సున్నితమైన భావన. ప్రత్యక్షంగా ఏమీ అనటంలేదు. పరోక్షంగా చెప్పవలసిందంతా చెప్తున్నాడు.

ఇలాంటి సందర్భం మన సినిమాల్లో ఎంత సాధారణమో, సినీకవులు, సంగీతదర్శకులు అంతే అసాధారణంగా ఏ పాటకు, ఆ పాటనే ప్రత్యేకంగా రూపొందించారు. గాయకులు తమ స్వరంలో భావాల రంగులతో ప్రతిపాటను ఒక మరపురాని అనుభవంగా మలిచారు. వేదనను అనుభవించటంలోని ఆనందాన్ని అనుభవానికి తెచ్చారు. వేదనకు ఉపశమనాన్నిచ్చి గీతంగా మలచారు.

'సుహానీ రాత్ ఢల్ చుకీ, న జానే తుం కబ్ ఆవోగీ '

'దులారీ' పాటలో భావం స్పష్టంగా ఉంది. నిజానికి విరహవేదన, ప్రేయసి కోసం ఎదురు చూపుల పాటలకు పెద్ద ఊపునిచ్చింది ఈ పాట. షకీల్ బదాయుని, నౌషాద్, రఫీలు కలసి ఈ పాటను పరమాద్భుతంగా రూపొందించారు. ఈ పాటలో భావం స్పష్టం. డొంక తిరుగుడు లేదు బాణీ కూడా. గానం కూడా. మహమ్మద్ రఫీ ఉచ్ఛస్వరంలో రాగం తీసి, మళ్లీ వెంటనే క్రింది స్వరానికి వచ్చేయటం, ఒక్కసారిగా హృదయం వేదనతో కేకపెట్టి సొమ్మసిల్లి నెమ్మదిగా తేరుకుంటున్న భావననిస్తుంది. ఇలా పదే పదే జరగటం, వేదన అలలు అలలుగా ఎగసిపడుతున్న భావనను కలిగించి విషాదంలోని ఆనందాన్ని, ఎదురు చూపులలోని మాధుర్యాన్ని అనుభవానికి తెస్తుంది. అయితే ఈ పాటలోని భావం ప్రత్యక్షం.

'షాం ఎ గం కీ కసం' పాటలో భావం పరోక్షం. అత్యంత మృదువైనది పాట బాణీ. ఒక గడ్డి పరిక చిరుగాలి తరగకు తల ఊపుతూ సృజించే అతి మృదువైన శబ్దతరంగాల అంతటి మృదువైంది ఈ గీతం. ఈ పాట చిత్రీకరించేది దిలీప్ కుమార్ పైన. దిలీప్ కుమార్ ఒక విలక్షణమైన నటుడు. అతని నటనలో నాటకీయత తక్కువ. సంభాషణలు పలికే విధానం ప్రత్యేకం. అతని నటన అధికంగా కళ్లతో. వదనంలో ప్రతిఫలించే భావాలతో అతి పరిమితమైన కదలికలతో సాగుతుంది. పెదవులు కదలీ కదలక పలికే రీతిలో సంభాషణలు పలుకుతాడు. అలాంటి నటుడు గొంతెత్తి అరిస్తే నప్పదు. ఆ అరుపు కూడా హృదయలోతుల్లోంచి వెలువడే అతి నిశ్శబ్దము, కానీ వేదనా భరితమైన ఆక్రందనలా  ఉండాలి. వేదన పైకి తెలియకూడదు. లోలోపల పొర్లి పొర్లి ఏడ్చినా అది బయటకు తెలియకూడదు. అందుకే మజ్రూహ్  సుల్తాన్ పురి అతి తేలికయిన పదాలు వాడాడు. పాటలకు శక్తిని బాణీ ఇస్తే, ప్రాణం గాయకుడి స్వరం పోసింది. మహమ్మద్ రఫీ తన స్వరంతో నటిస్తాడు. భావాలు పలికిస్తాడు. ముఖేష్ స్వరం వేదన స్వరం.  అది భగవద్దత్తం. తలత్ మహమ్మూద్ స్వరం వెన్నెల తీగ. విరహవేదనని పెంచుతుంది. కలసి ఉన్న ప్రేయసి ప్రియుల ఆనందం ఇనుమడింపచేస్తుంది. బాధలో ఉన్న వారిపై సానుభూతితో ప్రసరిస్తుంది. అందుకే తలత్ మహమ్మద్ స్వరం దిలీప్ కుమార్ నటనకు చక్కగా సరిపోతుంది. బంగారానికి తావి అబ్బినట్టుంటుంది. ఖయ్యాం తలత్ స్వరంలోని వెన్నెల కిరణాలను సాగదీసి వేదనను సానబట్టి మరింత చక్కగా, అందిస్తాడు ఈ పాటలో.

సంగీత దర్శకుడి గొప్పతనం సందర్భానికి తగ్గ బాణీని ఎంచుకోవటంలోనే కాదు, అందుకు తగ్గ గాయకుడిని ఎంచుకోవటంలో, కనిపిస్తుంది. బాణీకి తగ్గ వాయిద్యాల నడకతో సరిపోదు. వాయిద్యాల నుండి వెలువడే స్వరాలు ఓ వైపు బాణీని మెరుగు పరుస్తూ, మరోవైపు గాయకుడి స్వరంలోని భావానికి ఊపునిస్తూ, ఒక ఉత్తుంగ తరంగం శృంగ పైనున్న కిరణాన్ని మరింత తళతళలాడించినట్టు మెరిపించాలి. అంటే గాయకుడి స్వరంతో స్వరం కలిపి భావ తీవ్రతను పెంచాలి. చాలా తక్కువమంది సంగీత దర్శకులు వాయిద్యాలు భావాన్ని, బాణీని, గాయకుడి స్వరాన్ని ఇనుమడింప చేసే లక్షణాన్ని అర్థం చేసుకుని ఇంటర్ల్యూడ్ సంగీతాన్ని సృజిస్తారు. అలాంటి అరుదైన సంగీత దర్శకులలో ఖయ్యాం ఒకడు. అందుకే అత్యంత సాంప్రదాయమైన బాణీకి పాశ్చాత్య వాయిద్యాలు అతి సున్నితంగా వాడాడు. పియానో, గిటార్, సోలోవోక్స్, ఆ కాలంలో సింథసైజర్ లాంటి వాయిద్యం వాడాడు. ఆ కాలంలో వాడే ఏ రకమైన రిథం వాయిద్యాన్ని ముఖ్యంగా 'తబలా'లాంటి వాయిద్యాన్ని వాడలేదు దాంతో ఈ పాట ఒక విలక్షణమైన రీతిలో రూపొందింది. ఈ నాటికీ అంటే దాదాపుగా 67 ఏళ్ల తరువాత కూడా అత్యంత తాజాగా, ఆధునికంగా ధ్వనించే రీతిలో రూపొందింది. సింఫోనీ, టెంపో, నాడీ సిస్టం అన్నీ పాశ్చాత్య పద్ధతిలో సాగాయి. కానీ ఖయ్యాం అత్యధికంగా పాటలు రూపొందించిన పహాడీ రాగంలోనే అతి సాంప్రదాయికమైన ఉర్దూ గజల్ బాణీలో ఉంటుంది పాట. శాస్త్రీయ సంగీతం, పాశ్చాత్య సంగీతాల మేలుకలయిక అవటంతో అటు పాత తరం వారినీ, ఇటు నవతరంవారినీ తరతరాలుగా మెప్పిస్తూ సజీవంగా నిలుస్తోందీ పాట. గమనిస్తే, 'సుహానీ రాత్ ఢల్  చుకీ' కూడా పహాడీ రాగంపై ఆధారపడిందే. కానీ పహాడీ రాగంలో మృదుత్వాన్ని సీతాకోక చిలుకల రెక్కలపైనున్న రంగులలాంటి మృదువైన ఆహ్లాదాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించటం ఖయ్యాం ప్రత్యేకత. బహారో మేరా జీవన్ భీ

సవారో (ఆఖ్రీఖత్), పర్వతోంకె పేడోం పర్ షాం క బసేరా హై (షగున్), కభీ కభీ మెరె దిల్ మే (కభీ కభీ) వంటి విభిన్నమూ, అద్భుతమూ అయిన పాటలు ఖయ్యాం పహాడీ రాగంలో అందించిన అతిగొప్ప పాటలలో కొన్ని పాటలు.

**చైన్ కైసా జొ పహలూమె తూహీ నహీ**

**మార్ డాలే న దర్ద్ – ఎ – జుదాయీ కహీ**

**ఋత్ హసీన్ హై తొ క్యా, చాంద్ నీ హై తొ క్యా.**

**చాంద్ నీ జుల్మ్ హై ఔర్, జుదయీ సితం.**

ఎంత సులువైన, సరళమైన పదాలు అంతే సులభంగా మనసు గ్రహించే భావం. కానీ రాగం,లయ, వెనుక నుంచి వినిపించే వాయిద్యాల కదలిక, గాయకుడి స్వరం ప్రాణం పోసిన భావాలకు మరింత తీవ్రతను లోతును ఇస్తాయి. నువ్వు దరిని లేకుంటే శాంతి ఎలా కలుగుతుంది? ఈ విరహవేదన నన్ను చంపేస్తుంది. ఈ విరహ వేదనలో నేను మరణించినా మరణిస్తాను. వాతావరణం అందంగా ఉండి లాభం ఏమిటి? వెన్నెల ఉంటే లాభం ఏమిటి? వెన్నెల క్రూరమైనది. అన్యాయం చేస్తుంది. విరహం అణచివేస్తుంది. చంపేస్తుంది. ఇదీ చరణం భావం. కానీ పాట వింటుంటే గడ్డిపోచ శరమైనట్టు ఈ మామూలుగా కనిపించే భావం శూలమై ఎదలోలోతుల్లో స్పందనలు కలిగిస్తుంది. వేదనను ఆనంద స్పందనలుగా మలచి విరహ వేదనలోని మాధుర్యాన్ని అనుభూతికి తెస్తుంది.

ఇలాంటి సందర్భమే 'యాహుది' సినిమాలో వస్తుంది. దిలీప్ కుమార్ హీరో. అతను రోమన్. నాయిక యూదు. ఆమెకు ఆ నిజం తెలుస్తుంది. అయినా సరే ఆమెను ప్రేమిస్తున్నానని, ఆమెను కలవమని, తమ సంకేత స్థలంలో ఆమె గురించి ఎదురుచూస్తూ పాడతాడు పాట.

ఈ పాట రాసింది శైలేంద్ర. సంగీత దర్శకుడు శంకర్‌జైకిషన్. ఈ పాటను తలత్ మహమూద్ పాడాలని దిలీప్ కుమార్ కోరిక. కానీ శంకర్‌జైకిషన్ బాణీని ముకేష్‌ను దృష్టిలో ఉంచుకుని సృజించారు. అప్పటికి, ముకేష్, తలత్ మహమూద్ ఇద్దరూ హీరోలుగా అవ్వాలని ప్రయత్నించి భంగపడ్డారు. గాయకులు హీరోలవటంతో, అసలు హీరోలు తమకు వేరే గాయకుడి స్వరం కావాలని పట్టుబట్టడంతో తలత్, ముకేష్ లిద్దరూ అటు హీరోలు కాక ఇటు పాటలు లేక దెబ్బతిన్నారు. అలాంటి స్థితిలో తప్పు తెలుసుకుని పాటలకే పరిమితం అవ్వాలని నిశ్చయించుకున్నారు. అప్పుడు ముకేష్‌కు శంకర్‌జైకిషన్ ఈ పాటతో అవకాశం ఇచ్చి, ముకేష్ గాయక జీవితంలో రెండో రంగానికి శ్రీకారం చుట్టారు. చివరికి పాటను ముకేష్ స్వరంలో రికార్డు చేసి వినిపించారు. దిలీప్ కుమార్‌కు పట్టు విడవక తప్పలేదు. కానీ శంకర్‌జైకిషన్, దిలీప్ కుమార్‌లు కలిసి పనిచేసిన చివరి చిత్రం ఇది.

**దిల్ పె తుఝ్కో బేదిలీ హై, ముఝ్ కొ హై దిల్ కా గురూర్**

**తూ యె మానే కే న మానే లోగ్ మానేంగే జరూర్.**

**యే మెరా దీవానా పన్ హై, యా మొహబ్బత్ కా సురూర్.**

**తూ న పహెచానే తో హై యే, తేరి నజ్రోం కా కుసూర్.**

హృదయం పై నువ్వు చూపించే హృదయ రాహిత్యమైన దౌర్జన్యం ఇది. నా హృదయం పై నాకు విశ్వాసం ఉంది. నువ్వు ఒప్పుకోకున్నా ప్రజలు ఈ విషయం ఒప్పుకుంటారు. ఇది నా పిచ్చితనమో, నా ప్రేమ తీవ్రతనో, నువ్వు నా ప్రేమను గుర్తించకపోవటం నీ దృష్టి దోషం. ఈ భావం ముకేష్ స్వరంలో మరింత చిక్కదనాన్ని అలవరచుకుని, ప్రేయసికోసం ఎదురు చూపుల్లోని ‘poignancy'ని ప్రస్ఫుటం చేస్తుంది.

**దిల్ కో తేరీ హీ తమన్నా, దిల్ కొ హై తుఝ్ సె హి ప్యార్**

**చాహె తూ ఆయేన ఆయే, హం కరేంగే ఇంతిజార్.**

హృదయానికి నీ గురించే ఆలోచన. నీ గురించే కోరిక. హృదయానికి నీ పైనే ప్రేమ. నువ్వు వచ్చినా రాకున్నా నీ కోసమే ఎదురుచూస్తూ ఉంటాను. ఇది శైలేంద్ర రచన పద్ధతి. సూటిగా ఉంటుంది భావం. స్పష్టంగా ఉంటుంది. అతని భావాలను కొటేషన్స్‌గా వాడుకోవచ్చు. పల్లవి కానీ, చరణంలోని పాదాలు కానీ దేనికదే విడిగా ఒక సార్వజనీనత్వాన్ని పొదువుకుని ఉంటాయి.

ఈ పాటను శంకర్‌జైకిషన్ మిశ్రయమన్ రాగంలో రూపొందించారు. యమన్ రాగం స్వభావరీత్యా అత్యంత మధురమైన రాగం. సున్నితమైన భావాల సృజనకు నిలయం. ఈ పాటను ఆ రాగంలో రూపొందిస్తూ వయొలిన్లను ఎగసిపడే మంద్రమైన అలల రీతిలో ధ్వనింపచేయటంతో పాట ప్రభావం రెట్టింపవుతుంది. భావం తీవ్రమవుతుంది.

ఇలాంటి సందర్భంలోనే 'సాహిర్ లూథియాన్వీ' మరో అమరమైన గేయం రచించాడు. దానికి ఎస్డీ బర్మన్ సాంప్రదాయిక బాణీ కూర్చి పాశ్చాత్య వాయిద్యాలను అమర్చాడు. ఇంకేం పిలిస్తే ప్రేయసి పరుగులు పెట్టి రాకుండా ఉండలేనటువంటి అద్భుతమైన గీతం రూపొందింది. అయితే మిగతా రెండు పాటలతో పోలిస్తే ఈ పాటలో వాయిద్యాల దూకుడు ఎక్కువ. కానీ వాయిద్యాల వేడిలో చల్లదనాన్ని చిలికే హేమంత కుమార్ స్వరం, వేదనతోపాటూ ఆలోచనలను రగిలించే పదాలు, ధిక్కారాన్ని ప్రోత్సహించే భావం ఈ పాటకు ప్రత్యేకతనిచ్చాయి. మిగతా రెండు పాటలలో గేయ రచయిత తెరవెనుక ఉంటే, ఈ పాటలో గేయరచయిత వేదిక పైకి వచ్చి సంగీతాన్ని వెనక్కు నెట్టటం గమనించవచ్చు. ఇది 'సాహిర్' ప్రత్యేకత.

**యే రాత్ యే చాంద్ నీ ఫిర్ కహా**

**సున్ జా దిల్ కీ దాస్తాన్.**

ఇలాంటి వెన్నెల, ఇలాంటి రాత్రి మళ్లీ రాదు. ఎప్పుడొస్తుందో తెలియదు. కాబట్టి ఇప్పుడే వచ్చి నా హృదయపు గాథను విను. గమనిస్తే గేయ రచయిత వ్యక్తిత్వం గేయం ప్రతిఫలించటం చూడవచ్చు. మొదటి పాటలో వేదన ఉంది. స్వార్థం పైకి కనబడదు. రెండవ పాటలో స్వార్థం లేదు. ప్రేమ ఉంది. పూర్తిగా తనని తాను సమర్పించుకోవటం వుంది. నువు లేకపోతే శాంతి లేదంటాడు మొదటి పాటలో. నువ్వు వచ్చినా లేకున్నా నీకోసం ఎదురుచూస్తాను అంటాడు రెండో పాటలో. 'సాహిర్' స్వార్థపరుడు. ప్రేమ ఒక తీవ్రమైన వ్యక్తిగత స్వార్థం అని నమ్మినవాడు అందుకే ఇలాంటి రాత్రి మళ్లీ రాదు అంటున్నాడు. ఎందుకని అంటే హృదయ వేదనను నివేదించటానికి. వచ్చి, హృదయవేదన వినిపో అంటున్నాడు.

**పేడోంకి శాఖోంపె సోయి సోయి చాందినీ**

**తేరే ఖయాలోమె ఖోయి ఖోయి చాంద్‌నీ**

**ఔర్ థోడి దేర్ మే థక్ కె లౌట్ జాయెగీ**

**రాత్ యే బహార్ కీ ఫిర్ కభీన ఆయెగీ**

**దో ఎక్ ఫల్ ఔర్ హై యే సమా...**

**సున్ జా దిల్‌కి దాస్తాన్!**

చెట్ల ఆకులపై వెన్నెల నిద్రిస్తోందట. ఇలాంటి కవితాత్మకమైన భావం, హృద్యమైన భావవ్యక్తీకరణ సాహిర్‌కి మాత్రమే సాధ్యం. ఆమె ఆలోచనలతోనే మైమరచి, జగాన్ని మరిచిందట వెన్నెల. ఇంకాస్సేపటికి అలసి వెళ్లిపోతుంది. ఇలాంటి అందమైన రాత్రి మళ్లీ రాదు. ఇంకా ఒకటో రెండో క్షణాలు మాత్రమే ఈ వాతావరణం ఉంటుంది. అంతలోనే వచ్చి నా హృదయం మాట వినిపో అంటున్నాడు నాయకుడు.

మొదటి పాటలోది పొసెసివ్ లవ్. రెండవ పాటలోది సబ్మిసివ్ లవ్. మూడవ పాటలోది అగ్రెసివ్ లవ్. ఇది గేయ రచయితల వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. 'మజ్రూహ్' సుల్తాన్ పురి పాటలలో ఎక్కడా సంగీతాన్ని దాటి గుర్తింపు సాధించాలన్న ప్రయత్నం కనబడదు. నీరు ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర రూపం లో ఒదిగినట్టు, మజ్రూహ్ కలం సందర్భ పరిధిలో ఒరిగిపోతుంది. శైలేంద్ర తాత్వికుడు. తాను బాధను మౌనంగా స్వీకరిస్తాడు తప్ప ఎదుటి వ్యక్తిని ఏమీ అనడు. ఆయన స్వంతంగా 'తీస్రీకసం' అనే సినిమా నిర్మించాడు. స్నేహితులన్నవారు, బంధువులు అంతా అసలు రూపాలు చూపించారు. ఆ బాధతో మరణించాడు శైలేంద్ర. కానీ ఎవ్వరినీ ఏమీ అనలేదు. 'నువ్వొచ్చినా రాకున్నా ఎదురు చూస్తాన'నని అందుకే రాయగలిగాడు. సాహిర్ అలా కాదు. సాహిర్‌కి ప్రేమ మీద నమ్మకం లేదు. ప్రేమ అన్నది ఒక బలహీనత. స్త్రీ పురుషులు ఒకరినొకరు మోసం చేసుకునే స్వార్థపుటాట ప్రేమ. అందుకే నాయకుడి స్వార్థాన్ని ప్రదర్శించటమే కాదు 'సున్ జా' 'వినిపో మళ్ళీ ఈ రాత్రి రాదు' అనిపించగలిగాడు నాయకుడితో. ఇలాంటి భావాన్ని మజ్రూహ్ 'దిల్ జో న కహసకా, వహీ రాజ్ ఎ దిల్, కహనే కి రాత్ ఆయిహై' అన్నాడు. అంటే ఏదైతే మనసులో మాట చెప్పలేకపోయాడో, అది చెప్పే రాత్రి ఇదే' అన్నమాట.

అదే శైలేంద్ర 'హాతో బహుత్ కుఛ్ హై కహనేకో లేకిన్, అబ్ తో చుఫ్ బెహతర్ హై, ఆఖిర్ కిస్నే చాన్ చువాహై, హం క్యూన్ హాథ్ బఢాయే..', అంటాడు తుమ్హారీ భి జై జై అనే పాటలో . 'చెప్పటానికి బోలెడన్ని ఉన్నాయి. కానీ మౌనంగా ఉండటమే మేలు. చంద్రుడిని తాకినవారెవరు, నేనెందుకు చేయి సాచాలి...అంటే ఆమెకోసం తాను ఆశపడినా, ఆమె కాదనటంలో అర్థముందని అర్థం చేసుకున్నాడన్నమాట. . ' ఇదీ ఈ ముగ్గురు గేయ రచయితల వ్యక్తిత్వం. ఆలోచనా విధానం, అది వారు సృజించిన గేయాల్లో ముఖ్యంగా విరహ గీతాల్లో కనిపిస్తుంది. అందుకే 'సాహిర్' పదాల్లో, భావంలో ఉన్న 'దూకుడు' ఆధారంగా ఎస్డీ బర్మన్ కాఫీ రాగంలో, కెహెర్వా తాళంలో, పాశ్చాత్య వాయిద్యాలతో ఒక అద్భుతమైన గీతాన్ని సృజించాడు. చరణాల నడుమ వచ్చే సంగీతంలో ఒక దూకుడు, ఒక అలజడి, ఒక తొందరపాటు, ఒక తీవ్రమైన అశాంతి, డెస్పిరేషన్ కనిపిస్తుంది. కానీ చరణం ఆరంభం కాగానే గాయకుడి స్వరం ఆర్తిగా, బాధతో, ప్రేమతో, కరిగిన కాలం తిరిగి రాదనే వేదనతో పాటను పాడుతుంది. చరణం చివరికి వచ్చేసరికి బాణీలో తొందరపాటు పెరిగిపోతుంది. 'అయిపోతోంది, సమయం కరిగిపోతోంది' అన్న భాధ తెలుస్తుంది. అద్భుతమైన సృజన ఇది.

ప్రేయసి కోసం విరహవేదనతో ఎదురు చూసే పాటల సందర్భంలోంచి ఏరుకొచ్చిన ముత్యాలు ఇవి. ఇంకా అనేకమైన ముత్యాలు, రత్నాలు సముద్రగర్భంలో ఉన్నాయి. వాటిని వెతికి అనుభవించటం శ్రోతపని. ఒక పరమాద్భుతమైన ప్రపంచ ద్వారాలు తెరుస్తాయి సినీ పాటలు. ఆ పాటలతో మన కళాకారులు చేసిన ప్రయోగాలు, పొందు పరచిన భావాలు, గమనించి అనుభవిస్తూంటే జీవితంలో ఇంకేమీ అవసరం లేదనిపిస్తుంది. ఇలాంటి పాటలు వింటూ, భావాలు అనుభవిస్తూ, కళాకారుల సృజనాత్మక ప్రతిభను అర్థం చేసుకుంటు ముందుకు సాగటం తప్పించి జీవితానికి మరో ఆనందం అవసరం లేదనిపిస్తుంది మన కళాకారుల సమిష్టి సృజనాత్మక ఫలితాలయిన సినీగీతాలు వింటుంటే.

ఇలాంటి మరిన్ని మరో ప్రపంచపు ద్వారాలు తెరిచే మధురమైన మరుపురాని పాటలతో మళ్ళీ వచ్చే నెల 'కౌముది'లో కలుద్దాం.

**(మరిన్ని పాటలు వచ్చే నెలలో)**

Post your comments